www.prajasakti.com

# ప్రజాశక్తి

శుక్రవారం 11 జులై 2025

## పోలీసు స్టేషన్లో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

**ప్రజాశక్తి - రొంపిచర్ల:** చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు గురువారం రొంపిచర్ల, కల్లూరు పోలీస్‌స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీసు స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సర్కిల్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్ స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంకన్ అండ్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, తదితర కేసుల రికార్డ్సను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై కేసుల ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు. అలాగే పోలీస్ స్టేషన్లో నమోదైన, కేసుల్లో వృత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి త్వరితగతిన విచారణ పూర్తి చేసి, నిర్దేశిత కాల వ్యవధిలో కోర్ట్ లో ఛార్జ్ షీట్ ఫైల్ చేసి, సమర్థవంతమైన ట్రయిల్ ద్వారా నిందితులకు కఠిన శిక్ష పడేలా చేయాలని సూచించారు. అంతేకాకుండా సైబర్ నేరాలు, ముఖ్యంగా లోన్ యాప్‌ల మోసాలు, ఫోక్సో నేరాలపై అవగాహన కల్పించాలని అన్నారు. కల్లూర్ సిఐ సూర్యనారాయణ, ఎస్ఐ వెంకటేశ్వరులు, రొంపిచెర్ల ఎస్ఐబి. సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి: కలెక్టర్

## జిల్లాలో ఘనంగా మెగా పిటిఎం 2.0

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

**ప్రజాశక్తి- యంత్రాంగం, రొంపిచర్ల:** పిల్లలకు సంబంధించిన ప్రతి విషయంలో తల్లిదండ్రులు భాగస్వాములుకావాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్ అండ్ టీచర్ సమావేశం 2.0 కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రతినిధి చల్లా రామచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డి ప్రదీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలనుకుంటే తరచూ పాఠశాలలకు వెళుతూ ఉండాలని, ఉపాధ్యాయులతో వారి పిల్లల చదువుతున్న తీరును అడిగి తెలుసుకుంటూ ఉండాలన్నారు. పిల్లల ప్రతి కదలికపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలన్నారు. సోషల్ మీడియా, మొబైల్ వాడకంపై దృష్టి సారించాలని, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులలో పోటీతత్వం ఎక్కువగా ఉందని, ఈ పోటీలో నెగ్గాలంటే విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన చదువు, కృషి ఉండాలన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలు బాగా చదువుకోవాలని ఆరోగ్యంగా సత్ప్రవర్తనతో ఉండాలని కోరుకుంటారన్నారు. పిల్లలు విద్యార్థి దశలో సోషల్ మీడియాకు మొబైల్‌కు బానిసలు కావడం వలన ఆటలకు దూరమవుతున్నారన్నారు. దీని కారణంగా శారీరక, మానసిక ఉల్లాసం కోల్పోతున్నారన్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ మొక్కలు నాటారు. ఈ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు రిషిత, భరత్ కుమార్ నాయుడు, వీణావాణిలకు షైనింగ్ స్టార్ అవార్డులు సాదియా, ఓద, గీత శ్రీలకు ఎన్ఎంఎంఎస్ అవార్డులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. పాఠశాలలో వివిధ భవనాల నిర్మాణం పనులను పరిశీలించారు. ఎంపీడీవో అమర్నాథ్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు. పులిచెర్ల మండలంలోని కల్లూరు జెడిపి ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌ను పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ప్రారంభించారు. రొంపిచర్లలోని ఆకాష్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో మెగా పేరెంట్స్‌టీచర్స్ మీటింగ్ 2.0ను ఘనంగా నిర్వహించారు.

**తవణంపల్లి** మండలంలోని పొన్నేదుపల్లె మోడల్ ప్రైమరీ పాఠశాలలో మెగా పిటిఎం 2.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మొక్కల పంపిణీ చేశారు. విద్యా కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. పుత్తూరు సర్పంచ్ రవిచంద్ర రెడ్డి, పాఠశాల దాత యాగమూర్తి, గ్రామస్తులు పండు సాబ్, మహిళా పోలీస్ దివ్య పాల్గొన్నారు.

**వెదురుకుప్పం:** మండలంలోని చవటగుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మలకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీడీవో పురుషోత్తం, ఎస్సై వెంకట సుబ్బయ్య, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు పాదపూజ చేయించారు.

**చిత్తూరు అర్బన్ :**చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని సంతపేట పీఎస్సీ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌తో పాటు నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు పాల్గొన్నారు. బొమ్మసముద్రం ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే సొంత నిధులతో క్రీడాపరికరాలు అందించారు. ఎంపీడీవో శీరిష, ఎంఈఓ హసన్ బాష, నాయకులు బాలాజీ నాయుడు, నాగరాజు, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రశాంత్ నగర్ పరిధిలో మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్ టీచర్స్ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ డీటీ.సుధారాణి, జిల్లా ప్రోగ్రాం పర్యవేక్షణ అధికారులు నవీన్ తేజ్ రాయ్ పాల్గొని విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు.

**కార్వేటినగరం:** విద్యార్థుల చదువును తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలని మండల తహసీల్దార్ నాగరాజు అన్నారు. మండలంలోని ఆర్కేఎస్సార్, కత్తెరపల్లి, డీఎం పురం, కేఎం పురం, పాదిరికుప్పం, కొల్లాగుంటలో పాఠశాలతోపాటు అన్ని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మెగా పిటిఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో చంద్రమౌళి, ఎంఈవోలు విజయకుమార్, మనోజ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పలమనేరు** పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం మండల విద్యాశాఖ అధికారి లీలారాణి ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం ఘనంగా జరిగింది. పట్టణ కన్వీనర్ గిరిధర్, పట్టణ అధ్యక్షుడు ఆర్బీసీ కుట్టి, జగదీష్, మున్సిపల్ మేనేజర్ ఖాదర్ బాషా, పూసల రవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

**పూతలపట్టు:** విద్యార్థులకు విద్యతోనే బంగారు భవిష్యత్తు అని పూతలపట్టు తహశీల్దార్ రమేష్ బాబు అన్నారు. చిటికురాల్లోని గురుకుల పాఠశాలలో జరిగిన పిటిఎం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ పోటీల్లో పొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరిగింది.

**గంగాధర నెల్లూరు:** మండలంలోని వేపంజేరి, తూగుండ్రం గ్రామలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ తూగుండ్రం హెచ్ఎం రాజేంద్ర నాయుడు, వేపంజేరి జడ్పీ స్కూల్ హెచ్ఎం మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అగ్రికల్చర్ జేడీ మురళీ కృష్ణ, ఎంపీడీవో కృష్ణ మహేష్ రెడ్డి చేతుల మీదుగా పలు పోటీల్లో గెలుపొందిన బహుమతులు ప్రధానం చేశారు. పంచాయతీ సెక్రటరీ శిరీష, ఏఎస్ఐ మురళి ప్రసాద్, ఎంపీటీసీ రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

**వీకోట :** మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు కళాశాలలో మెగా పిటిఎం 2.0ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి, సిఐ సోమశేఖర్ రెడ్డి, అమ్మాక్స్ అధినేత దశరధ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు రంగనాథ్, వీకోట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పిఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

**సోమల:** మండలంలోని కందూరు, సోమల ఉన్నత పాఠశాలలో సమావేశాలకు మండల ప్రత్యేక అధికారిని గౌరీ, ఎంపీడీవో నారాయణ ఎంఈఓ శివరత్న హాజరై ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానం చేశారు. ఇరికిపెంట పాఠశాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, వడ్డీపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పిఆర్ శ్రీదేవి ఆధ్వర్యంలో పిటిఎం జరిగింది.

బంగారుపాళ్యంలో ఎంపి

**గంగవరం:** మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**విజయపురం:** గ్రామాల్లో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ జరిగింది. విజయపురం డాక్టర్ విష్ణు ప్రియ, పంచాయతీరాజ్ అధ్యక్షులు చుక్క ధనుంజయ్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. అలాగే మండల అభివృద్ధి అధికారి రాజేంద్ర, మండలవిద్యాశాఖ అధికారి హరిప్రసాద్ వర్మ బహుమతులు అందచేశారు. ఎస్సై రంగా, ఎంఈఓ హరిప్రసాద్ వర్మ, ధరణి, మునిచంద్ర పాల్గొన్నారు.

**బైరెడ్డిపల్లి:** మండలంలోని కమ్మనపల్లిలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ స్కూల్. ఏపీఆర్ఎస్ స్కూళ్లలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు, ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, టిడిపి అధ్యక్షులు కిషోర్, భువనచంద్ర పాల్గొన్నారు.

**కుప్పం రూరల్ :** కుప్పం మండల పరిధిలోని పలు విద్యాసంస్థలలో ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. గరిగచినేపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, కంగుంది గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మణిరత్నం పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో చెట్లు నాటి విద్యార్థులకు స్ఫూర్తిని అందించారు. స్థానిక కుప్పం పబ్లిక్ స్కూల్, జూనియర్ కాలేజీలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**బంగారుపాళ్యం:** విద్యాప్రమాణాలను పెంచుకోవాలని ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్, ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రన్ పాల్గొన్నారు.

**యాదమరి:** మండలం కోనాపల్లి పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి పాల్గొన్నారు. తహశీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, మండల విద్యాశాఖ అధికారి, రుక్మిణి, ప్రసాద్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి రబ్బి పాల్గొన్నారు.

యాదమరిలో జెసి విద్యాధరి

## ఐసిడిఎస్ సేవలు పక్కాగా నిర్వహించాలి

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** మాతా శిశు సంరక్షణ పథకం ద్వారా అమలు చేస్తున్న అన్నిరకాల సేవలను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లాలోని 12 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలోని సిడిపిఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సూపర్‌వైజర్ 150 మంది పిల్లల బరువు తక్కువ (వేస్టింగ్) డేటాను సేకరించి, రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. గత డేటాతో ప్రస్తుత గ్రౌండ్ లెవెల్ డేటాను సేకరించి, పోల్చి, పురోగతిని పరిశీలించారు. అలాగే ఐసిడిఎస్ కార్యక్రమాల కింద సరఫరా అయ్యే పప్పు, పాల నాణ్యతను పర్యవేక్షించి, లోపాలను నివేదించాలన్నారు. లబ్ధిదారుల ఆధార్ వివరాలను నవీకరించాలని, సమస్యలను గుర్తించి నమోదు చేయాలని, ఆధార్ సమస్యలు ఎక్కువగా ఉన్నమండలాలను గుర్తించి, వివరణాత్మక నివేదిక సమర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సమాజాలకు సందర్శనల సంఖ్యను పెంచాలన్నారు. కుప్పం స్క్రీనింగ్ నాణ్యత కుప్పంలో ఆరోగ్య, పోషణ స్క్రీనింగ్ నాణ్యతను మెరుగుపరచాలని, ఫీడ్‌బ్యాక్ ఆధారంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు వేస్టింగ్ డేటా సేకరణ, రిజిస్టర్ నిర్వహణ, క్షేత్ర సందర్శనలు, ఆధార్ నవీకరణ, కుప్పం స్క్రీనింగ్ మెరుగుపరచుకోవాలన్నారు.

ఐసిడిఎస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

## కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ

కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

**ప్రజాశక్తి- గుడిపల్లి:** మండల కాంప్లెక్స్ నిర్మాణానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ గురువారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ అభివృద్ధి చేసింది.. చేయబోయేది రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అని అన్నారు. మండల కాంప్లెక్స్ గత ఆరు సంవత్సరాల నుండి నిర్మాణానికి నోచుకోలేని దుస్థితిలో ఉండడంతో ముఖ్యమంత్రి ఆదేశానుసారం రూ.4కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. నేడు కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఏపిఎస్ ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్.మునిరత్నం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి వైసిపి నాయకులు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు వెంట నడవాల్సిన పరిస్థితి ఉందన్నారు. మండల అధ్యక్షులు బాబు నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, హేమంబార్ గౌడు, మునిరాజు, ఎల్లప్ప, సుబ్రమణి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ శివను పరామర్శించిన ఎంపి

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి బంగారుపాలెం పర్యటనలో దాడికి గురై తీవ్రంగా గాయపడి, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫోటో జర్నలిస్ట్ శివకుమార్‌ను గురువారం చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పరామర్శించారు. దాడి ఘటనకు సంబంధించిన వివరాలను శివకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫోటో జర్నలిస్ట్‌కు అందుతున్న వైద్యసేవల గురించి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. శివకుమార్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం అన్ని రకాల ఆదుకుంటుందని భరోసానిచ్చారు. శివకుమార్ పై దాడి పాల్పడ్డ వారిని గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకునే విషయంలో కూటమి ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడదన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని ఎంపీ తెలిపారు.

ఫోటో జర్నలిస్ట్ శివకుమార్‌ను పరామర్శిస్తున్న ఎంపి

## ఆగస్టు15కి 15 లక్షల బంగారు కుటుంబాల దత్తత లక్ష్యం

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్**

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్**

రాష్ట్రంలో ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వివిధ అంటువ్యాధుల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. స్వర్ణాంధ్ర పి-4 ఫౌండేషన్, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు, వివిధ సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొన్నారు. సిఎస్ మాట్లాడుతూ వర్షాకాలంలో వాటర్‌బోర్న్, వెక్టర్‌బోర్న్ సంబంధిత వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రభలకుండా ఎప్పటికప్పుడు డిఎం అండ్ హెచ్ఓ, సూపరింటెండెంట్లతో సమావేశం జరిపి రోజు వారీ పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని తాగునీటి పైపులైన్లన్నీ లీకేజిలు లేకుండా సక్రమంగా ఉండేలా చూడాలని సిఎస్ విజయానంద్ చెప్పారు. స్వర్ణాంధ్ర పి-4 కార్యక్రమంపై మాట్లాడుతూ ఆగష్టు 15 నాటికి రాష్ట్రంలోని 15 లక్షల బంగారు కుటుంబాలు(పేద కుటుంబాలను) మార్గదర్శులు దత్తత తీసుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబాన్ని పేదరికం నుండి బయటికి తెచ్చేందుకు మార్గదర్శులు ద్వారా వారికి తగిన తోడ్పాటును అందించాల్సి ఉందని ఆదిశగా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లాలో పి ఫోర్ వివరణ కోరగా జిల్లా కలెక్టర్ జిల్లాలో చేపడుతున్న చర్యలను వివరించారు. జిల్లాలో మొత్తం 65,451 బంగారు కుటుంబాలు గుర్తించినట్లు వెల్లడించారు. వీటిలో కుటుంబాలను దత్తత తీసుకున్నారని, ఇంకా కుటుంబాలు దత్తత కోసం ఎదురు చూస్తున్నాయని తెలిపారు. ఈనెల 15వ తేదీలోపు 1,93,424 కుటుంబాల దత్తత లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు ముమ్మరం చేసామని అన్నారు. నియోజకవర్గాల వారీగా వివరాలను వెల్లడిస్తూ చిత్తూరు 7,953, గంగాధర నెల్లూరు (ఎస్ సి) 11,573, కుప్పం 10,407, నగరి 5135, పలమనేరు10,106, పుంగనూరు 9,541, పూతలపట్టు 10,736 మొత్తం : 65,451 కుటుంబాలు ఉన్నట్లు వివరించారు. పీ4 కేవలం దాతృత్వ కార్యక్రమం కాదని, గ్రామాలు స్వయం సమృద్ధిని సాధించి, స్వయంగా ఇతర గ్రామాలకు సహాయపడే శాశ్వత సామాజిక ఉద్యమంగా భావించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాడు: పెద్దిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డప్ప

**ప్రజాశక్తి- సోమల:** చంద్రబాబు మోసపూరిత హామీలు, అబద్ధాలతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాడని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం సదుం మండలం ఎర్రాతివారిపల్లె అయ్యప్పస్వామి ఆలయం వద్ద బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసిపి భూమన కరుణాకర్ రెడ్డి హాజరయ్యారు. మాజీ ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని కూలదొయడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని, పరిస్థితులను గమనిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలు ఐకమత్యంగా కలసి పనిచేయాలని, పుంగనూరు రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచే విధంగా కృషి చేయాలని కోరారు. పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్ ఆలిమ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారని అన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ బాబు ప్రజలకు చేస్తున్న మోసాన్ని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాలని ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించుకొని బాబుపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని అందరికీ తెలిసేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

**మీ ఉడత ఊపులకు భయపడం: డాక్టర్ సునీల్ కుమార్**

**బంగారుపాళ్యం:** మీ ఉడత ఊపులకు భయపడమని వైసిపి పూతలపట్టు నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. గురువారం జడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా స్వగృహంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మామిడి రైతుల పరామర్శ కార్యక్రమం విజయవంతమైందని అందుకు సహకరించిన ప్రతి మామిడి రైతుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఎల్లో మీడియా బంగారుపాళ్యం రైతులను దండుపాళ్యంగా మార్చడం చాలా బాధాకరమని, బంగారుపాళ్యంకు ఒక చరిత్ర ఉన్నదని దాన్ని తెలుసుకోవాలన్నారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పండిన పంట అమ్ముకునేదానికి ధర లేకుండా పోవడంతో రైతులు రోడ్లపై మామిడిని పోసి నిరసన వ్యక్తం చేశారని, వారిపై కూడా కేసులు నమోదు చేయడం, రైతులను రౌడీలుగా చిత్రీకరించడం బాధాకరమన్నారు. పోలీసులు వ్యవహరించడం తీరు మంచిది కాదని, రాష్ట్రాన్ని మరో బీహార్‌గా తయారు చేయబోతునారా అని ప్రశ్నించారు. సమావేశంలో మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రకాష్ రెడ్డి, కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ కామరాజు, గజేంద్ర, పాలాక్షి రెడ్డి, రఘుపతి రాజు పాల్గొన్నారు.

**స్పందన జీర్ణించుకోలేకనే విమర్శలు..**

**చిత్తూరుఅర్బన్:** బంగారుపాళ్యంలో మామిడి రైతుకు అండగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ పర్యటనకు రైతులు నుంచి వచ్చిన విశేష స్పందనను జీర్ణించుకోలేని టిడిపి నాయకులు, ఎల్లో మీడియా విషం చిమ్ముతున్నారని వైసిపి రైతుల సంఘం నాయకులు తెలుగుదేశం నేతల విమర్శలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులపై రౌడీషీట్లు తెరుస్తామని ఒకరు, రైతులను దండుపాళ్యంతో పోలుస్తూ ఒ ఇలా రైతులను అడుగడుగునా అవమానిస్తున్న ఎల్లో బ్యాచ్ తీరును ఖండించారు.

## చిత్తూరు కార్పొరేషన్ రూపురేఖలను మారుస్తాం : ఎంపి, ఎమ్మెల్యే

**రోడ్డు విస్తరణ పనులకు భూమి పూజ**

రోడ్డు విస్తరణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపి, ఎంఎల్ఏ

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ అన్నారు. చిత్తూరు కార్పొరేషన్ రూపురేఖలను మార్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, జిల్లా కేంద్రమైన చిత్తూరును అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దడమే తమ ముందున్న లక్ష్యమని ఉద్ఘాటించారు. చిత్తూరు నగరంలో ప్రధాన రహదారుల విస్తరణ పనులపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా గురువారం నగరంలోని ఏపీఎస్ ఆర్టీసీ, భాస్కర్ హోటల్ సమీప రోడ్డును చిత్తూరు రహదారి మార్గాల విస్తరణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు. ఏ ప్రాంతమైన రోడ్లు అభివృద్ధి చెందినప్పుడే అది ప్రగతి పథంలో దూసుకెళ్తుందని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ సీనియర్ నేతలు కాజూరు బాలాజీ, త్యాగరాజు, యువరాజుల నాయుడు, మాజీ కార్పొరేటర్ ఆనంద్ బాబు పాల్గొన్నారు.

## వినాయక స్వామి వారికి విభూది పట్టి విరాళం

**ప్రజాశక్తి- ఐరాల:** శ్రీవరసిద్ధి వినాయక స్వామివారికి రాళ్లతో కూడిన బంగారు విభూది పట్టిని దాత చంద్రశేఖర్ వారి కుటుంబ సభ్యులు గురువారం దేవస్థానం ఈవో పెంచల కిషోర్‌కి ఈవో కార్యాలయంలో అందజేశారు. యుఎస్ఏలో నివాసముంటున్న దాత చంద్రశేఖర్ రూ.14,00,000ల విలువగల 140 గ్రాముల బంగారు విభూది పట్టిని అందజేశారు. వీరికి ఆలయ సిబ్బంది దర్శన ఏర్పాటు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రం చిత్రపటాన్ని ఏఈఓ రవీంద్రబాబు అందించారు. సూపరింటెండెంట్ రంగస్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై దృష్టి సారించాలి: డీఎల్‌ఓ

**ప్రజాశక్తి- పూతలపట్టు:** పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌వో రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని వంటిల్లు గ్రామం వద్ద పారిశుధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. క్రమం తప్పకుండా గ్రామాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నివారణకు పాకింగ్ వంటివి చేయాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో పారిశుధ్యంపై అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. తాగునీటి ట్యాంకులు 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని, చెత్త సేకరణ రోజూ విధిగా నిర్వహించాలని సూచించారు.

## వ్యర్థాలను తొలగించండి : ఎంపిడిఓ

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** మండలంలోని పెరుమాళ్ళపల్లి గురువారం పంచాయతీలో జరుగుతున్న ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని, గ్రామపంచాయతీ పరిధిలో గల చేతిపంపుల పనితీరును ఎంపిడిఓ పురుషోత్తం గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మట్లాడుతూ ఇంటింటికీ చెత్తసేకరణ, పారిశుధ్యం, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్ క్లీనింగ్, క్లోరినేషన్, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌లో వర్మి కంపోస్ట్ తయారీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామ పంచాయతీ పరిధిలో చాలా రోజులుగా పట్టించుకోకుండా వదిలేసిన పాత వ్యర్థాలను తొలగించడం, చేతి పంపుల నిర్వహణ వంటి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి శశి ఆనంద రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేష్, సచివాలయ సిబ్బంది, హరిత రాయబారులు పాల్గొన్నారు.

## గ్రంధాలయానికి పుస్తకాలు వితరణ

**ప్రజాశక్తి- విజయపురం (నగరి):** నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ డి.రామాంజులు తాను రచయితగా ఏపీ తెలుగు అకాడమీ వారి పోటీ పరీక్షల కోసం రాసిన "ఆంధ్ర ప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ" పుస్తకాలను తాను పనిచేస్తున్న కళాశాల గ్రంధాలయానికి వితరణగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రాజు, ఐక్యూ ఏపీ కోఆర్డినేటర్ డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని అభినందించారు. తాజా పుస్తకాలు డిగ్రీ విద్యార్థులకు పోటీ పరీక్షలకు బాగా ఉపయోగపడుతాయని తెలిపారు. తమకు పాఠాలు చెప్పి అధ్యాపకులచె రాసిన పుస్తకాలు లైబ్రరీలో ఉండటం విద్యార్థులకు మంచి ప్రేరణగా ఉంటుందని అన్నారు.

## శాకాంబరిదేవి అమ్మవారి పూజలో ఎమ్మెల్యే

**ప్రజాశక్తి- ఐరాల:** కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన మకరధాంభిక సమేత శ్రీమణికంఠేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని శాకాంబరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మకరధాంభిక అమ్మవారు శాకాంబరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శాకాంబరి దేవి అమ్మవారిని 20 టన్నుల పండ్లు, ఆకుకూరలు, కూరగాయలతో విశేషంగా ఆలయ అర్చకులు అలంకరించారు. పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆలయానికి విచ్చేసి అమ్మవారికి పూజాసామగ్రి సమర్పించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు ఎమ్మెల్యేకి వేదాశీర్వచనం అందించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాణిపాకం ఆలయ ఈవో పెంచల కిషోర్, నియోజకవర్గం పరిశీలకులు బొమ్మన శ్రీధర్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి మండలాధ్యక్షులుగా వెంకటేష్ చౌదరి

**ప్రజాశక్తి- తవణంపల్లి:** చిత్తూరు నగరంలోని లక్ష్మీనగర్ కాలనీలో టిడిపి పూతలపట్టు ఎమ్మెల్యే కార్యాలయంలో శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ అధ్యక్షతన మండలంలోని టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో తవణంపల్లి మండలం టిడిపి అధ్యక్షుడిగా వెంకటేష్ చౌదరిని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని, ఇవి తెలుగుదేశం పార్టీ ఐక్యతకు నిదర్శనమని తెలియజేశారు. మండల అధ్యక్షులుగా కొనసాగుతున్న నాయకులు పార్టీ బలోపేతానికి మండల స్థాయిలో బాధ్యతయుతంగా నాయకత్వం వహించాలని తెలిపారు.

## నాయకులను పరామర్శించిన నారాయణస్వామి

**ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు:** మండలంలోని వింజం పంచాయతీలోని అశోక్ కుటుంబ సభ్యులు యేసుమని మూడు రోజుల క్రితం మృతి చెందగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, సత్యవేడు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి నూకతోటి రాజేష్‌తో కలిసి గురువారం అశోక్ కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ సర్పంచ్ గోవిందన్, ఎంపీటీసీ హనీఫ్ బాషా, జిల్లా బూత్ కన్వీనర్ వెంకటేష్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే వీరక నెల్లూరు గ్రామంలోని అగర మంగళం ఎంపీటీసీ ఇందిర అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న నారాయణస్వామి ఎంపీటీసీ ఇందిరను పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కోదండన్, వజ్రవేలు పాల్గొన్నారు.

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**ప్రజాశక్తి -సోమల:** గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. సోమల, పెద్ద ఉప్పరపల్లి గ్రామాలలోని సాయిబాబా ఆలయాలలో జరిగిన గురుపూజోత్సవ ఉత్సవాలలో భక్తులు విశేషంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

### తులసీనాథం నాయుడుకు ఘన సన్మానం


గంగవరంలో..

**గంగవరం:** గురుపౌర్ణమిని పురస్కరించుకొని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసీనాథం నాయుడును స్వావలంబి భారత్ అభియాన్ జిల్లా అధ్యక్షుడు యు.ఎస్ ఉమామహేష్ ఆధ్వర్యంలో గురువారం కళామందిరంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా తులసీనాథం మాట్లాడుతూ సమాజంలోని అజ్ఞానాన్ని పారద్రోలడమే నిజమైన గురువుల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, రామారావు, గురుమూర్తి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

**కార్వేటినగరం:** మండల కేంద్రంలోని సాయిబాలాజీ నగర్లో వెలసి ఉన్న శ్రీషిరిడీ సాయినాధుని ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. బాబా మూల విరాట్ను పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి, కాగడ హారతులు పట్టారు. అనంతరం సుమారు వెయ్యిమందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఎంపీపీ లతబాలాజీ, కమిటీ సభ్యులు రాజశేఖర్, చిరంజీవిరెడ్డి, పయణిరెడ్డి పాల్గొన్నారు.

**బంగారుపాళ్యం:** మండలంలోని మాధవ్ నగర్ వద్ద గల బ్రహ్మానంద ఆశ్రమంలో కేశవానంద స్వామి ఆధ్వరంలో ఆశ్రమంలోని సత్యనారాయణ స్వామి వివిధ దేవతామూర్తులకు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా కరణం సంక్షేమ సంఘం సభ్యులు వ్యవహరించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో తులసి కుమార్, శంకరన్, లక్ష్మీనారాయణ, పార్వతి, సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

**గుడిపల్లి:** మండలం ఓఎన్.కొత్తూరు గ్రామపంచాయతీలో గురుపౌర్ణమి సందర్భంగా గురువులకు సన్మానం ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల మాజీ జెడ్పిటిసి బేటప్ప నాయుడు గురువులను సత్కరించారు.

**ఎస్ఆర్ పురం:** మండలంలోని గురువారం గురుపౌర్ణమి సందర్భంగా కొత్తపల్లిమిట్ట, డిఆర్ పురం, పల్లేరుకాయ కోనలో ఆత్మ లింగేశ్వర స్వామి ఆలయంలో పూజా నిర్వహించారు. ఆరిమాకులపల్లెలో గురుపౌర్ణమి విశిష్టతను తెలియజేశారు. జనార్ధన ఆచార్యులు, గురువులు నరసింహారెడ్డి, గోవిందస్వామి నాయుడు, భగవద్గీత ఉపాసకులు సుధాకర్ పాల్గొన్నారు.

శాంతిపురంలో

**శాంతిపురం:** స్థానిక పరమహంస యోగానంద విద్యాలయంలో గురుపూర్ణిమ వేడుకలు, మెగా పిటిఎం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అలాగే తల్లిదంగ్రులకు పిల్లలతో పాదపూజ చేయించారు. విద్యాలయ ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యంచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు.

కార్వేటినగరంలో..

## నర్సింగ్ కళాశాలలో మెడికల్ కోడింగ్ విద్య

**ప్రజాశక్తి- కుప్పం రూరల్:** కుప్పం నర్సింగ్ కళాశాలలో మెడికల్ కోడింగ్ విద్యను అందించనున్నట్టు కళాశాల ఉపాధ్యక్షులు డాక్టర్ సునీల్ రాజు తెలిపారు. ఇందుకు సంబంధించి థర్మిట్ ఎడుకేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం చేసుకుందామన్నారు. సంస్థ అధ్యక్షులు భరత్ ఆంటోనీ కోడింగ్ విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## బస్సు సర్వీసు ప్రారంభం

**ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం :** గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ అన్నారు. గురువారం మండలంలోని పుల్లూరు గ్రామం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరుకు ప్రజలు వెళ్లటకు బస్ సర్వీస్‌ను ప్రారంభించారు. కొత్తపల్లి గ్రామపంచాయతీ 49. కొత్తపల్లిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.6లక్షల విలువచేసే ప్రహరీ గోడ, రూ.13 లక్షలతో కెమిస్ట్రీ ల్యాబ్‌లను ప్రారంభించారు. అలాగే కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వంటగది నిర్మాణం, స్పోర్ట్స్, ప్రార్ధన స్థల ప్రాంగణం పై కప్పు నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మెగా పేరెంట్స్ సమావేశంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆట పోటీలలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ లోకనాథ పిల్లై, ఎంఈఓలు అరుణాచల రెడ్డి, సబర్మతి ఏపీఓ లలిత, మండల పార్టీ అధ్యక్షులు గంధంనేని జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, స్కూల్ చైర్మన్ ప్రహల్లాదన్, సూరిరెడ్డి పాల్గొన్నారు.

## ఓటరు నమోదుపై సమగ్రమైన సర్వే నిర్వహించాలి

### స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

బూత్లవల్ సిబ్బందితో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు లాంటి వాటిపై బూత్లవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి సమగ్రమైన సర్వే నిర్వహించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ తెలిపారు. గురువారం మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఎల్వోల శిక్షణా సమావేశానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. బూత్లవల్ అధికారులు పామ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం బూత్లవల్ అధికారులు ఆన్లైన్ ద్వారా సమగ్రమైన పరీక్ష విధానాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఆర్వో, ఏఈఆర్వో, డిప్యూటీ తహసీల్దార్ త్యాగరాజు, పలువురు బూత్ లెవల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలలో వైభవంగా గురు పౌర్ణమి గరుడ సేవ

**ప్రజాశక్తి - తిరుమల:** గురు పౌర్ణమిని పురస్కరించుకుని తిరుమలలో గురువారం రాత్రి గరుడ వాహన సేవ వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. వాహన సేవలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.



## అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన..

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, ఏడాది కాలంలోనే ఎక్కువ అభివృద్ధి పనులు, మెరుగైన సంక్షేమాన్ని ప్రజలకు అందించినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు – ఇంటింటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా గురువారం చిత్తూరు నగరపాలక పరిధిలోని 45,46,47,48,49 వార్డు పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను, సాధించిన విజయాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. 47వ డివిజన్ పరిధిలో బాలికలకు సైకిళ్లను, మహిళలకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేయర్ ఎస్. అముద, మాజీ ఎమ్మెల్సీ బీఎన్.రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, కాజూరు బాలాజీ పాల్గొన్నారు.


చిత్తూరులో..

ఎస్ఆర్ పురంలో ఎంపి, ఎమ్మెల్యే

**ఎస్ఆర్ పురం:** ప్రజల కష్టాలను తెలుసుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సుపరిపాలన తొలి అడుగు, ఇంటింటికి టిడిపి కార్యక్రమాలను తీసుకొచ్చిందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, రాష్ట్ర చీఫ్‌విప్ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కటికపల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ ఏడాదిలో తెలుగుదేశం పార్టీ చేసిన సేవలను అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో జి.రాజశేఖర్ నాయుడు, సి.కుమార్ బాలాజీ నాయుడు, వేమన నాయుడు, పి.మురళి, కేయం.రవి, టి.నాగరాజు పాల్గొన్నారు.

# విలేకరులపై దాడి అమానుషం

**ప్రజాశక్తి- కుప్పం రూరల్:** రాష్ట్రంలో తరుచు విలేకరులపై దాడులు జరగడం దారుణమంటూ కుప్పం విలేకరులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం కుప్పం ప్రెస్‌క్లబ్ తరుపున తహశీల్దార్ కార్యాలయం నుండి డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని నినదిస్తూ జరిగిన ర్యాలీలో భాగంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం డీఎస్పీకి వినతి పత్రాన్ని అందజేసి, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పర్యటనలో ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్టుపై దాడికి పాల్పడ్డ వారిని చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని కోరారు.

పూతలపట్టులో విలేకర్ల నిరసన

డిఎస్పి కి వినతి పత్రాన్ని అందిస్తున్న కుప్పం విలేకరులు

**పూతలపట్టు:** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బుధవారం బంగారుపాలెం మండలంలో మామిడి రైతులను పరామర్శించడానికి వచ్చిన సందర్భంగా కవరేజ్‌కి వెళ్ళిన ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ నాయకులు దాడికి పాల్పడం హేయమైన చర్య అన్నారు. ఈదాడిని నిరసిస్తూ బుధవారం నియోజకవర్గంలోని పలువురు విలేకరులు పూతలపట్టులోని అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మహిళా సాధికారతకు ఉపాధి శిక్షణ

## ఏపీ రూసా ప్రాజెక్టు డైరెక్టర్ భరత్ గుప్తా

**ప్రజాశక్తి - క్యాంపస్**

రాష్ట్రంలో మహిళా సాధికారత సాధించేందుకు మహిళలకు సరైన ఉపాధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం అత్యవసరమని ఏపీ రూసా ప్రాజెక్టు డైరెక్టర్ భరత్ నారాయణ గుప్తా పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో సావేరి అతిథి గహంలో వివిధ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లు వర్సిటీ వివిధ విభాగాల అధ్యక్షులు, అధ్యాపకులతో " జెండర్ ఇంక్లూజివ్ ఎంపవర్మెంట్ ఇనిషియేటివ్ ' అంశంపైన వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య రూస ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ భరత్ నారాయణ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బాలికల విద్యను పెంపొందించేందుకు, మహిళలకు ఉపాధి కల్పించేందుకు, ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. మహిళల కోసం సరైన ప్రణాళిక రూపొందించి దాని ద్వారా ఉత్తమ ఫలితాలు తీసుకురావడం ఈ రూసా ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం అన్నారు. ముఖ్య అధితిగా ఎపి ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ రామమోహన్ రావు మాట్లాడుతూ పీఎం ఉష స్కీం ద్వారా ఆంధ్రప్రదేశ్ లోని యూనివర్సిటీస్‌కి ఫండింగ్ రావటం, దానిని సరైన పద్ధతిలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విసి వి.ఉమ మాట్లాడుతూ నిధుల కొరత ఉన్న ఈ సమయంలో పీఎం ఉష ద్వారా 100 కోట్లు మహిళా యూనివర్సిటీకి రావడం చాలా సంతోషం, బాధ్యతను ఇంకా పెంచింది అన్నారు. ఇన్స్టిట్యూషనల్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా చుట్టుపక్కల ఉన్నటువంటి మహిళలకు వారి అవసరాలకు తగిన విధంగా ట్రైనింగ్ ఇవ్వడం, వారి పురోగతికి దోహదపడటం చాలా ముఖ్యమని అన్నారు. సిఎండి, ఏఎస్ఏపి, కేరళ డాక్టర్ ఉష మాట్లాడుతూ కేరళలో అవలంబించిన మహిళా సాధికారత ప్రణాళికలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ తులసి, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజిని పాల్గొన్నారు.

# క్రైం న్యూస్

## ఎర్రచందనం స్వాధీనం

### ఇద్దరు ముద్దాయిలు అరెస్టు

నిందితులను, ఎర్రచందం దుంగలను చూపుతున్న పోలీసులు

**ప్రజాశక్తి - రొంపిచర్ల:** పులిచెర్ల మండలంలో పీలేరు అటవీ శాఖ సంచారదళ నిఘా విభాగం అధికారులు ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయం పులిచెర్ల –కల్లూరు రోడ్డు మార్గంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో పీలేరు అటవీ శాఖ సంచారదళ నిఘ విభాగం అధికారులు కాపు కాసి ఉండగా రెండు వాహనాల్లో అక్రమంగా ఎర్రచందనం దుంగలు తరలిస్తుండగా వెంబడించి పట్టుకొని ముద్దాయిలను అరెస్టు చేసి, ఎర్రచందనంతోపాటు వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు. నిందితులు తిరుపతి బొమ్మగుంట ప్రాంతానికి చెందిన నరసింహులు, పవన్ కళ్యాణ్‌లుగా గుర్తించారు. మల్లికార్జున అనే ఒక ముద్దాయి తప్పించుకుని పారిపోయాడని అతన్ని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. సుమారు 181 కేజీలున్న ఎనిమిది ఎర్రచందనం దుంగలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారని దీని విలువ రూ.13,68,707లుగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఈదాడిలో డీఎఫ్ఓ ఎం.గురు ప్రభాకర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.చంద్రశేఖర్, ఎఫ్ఎస్ఓ కె.ప్రకాష్ కుమార్, ఎఫ్‌బీవోలు కె.ప్రతాప్, పి.రెడ్డిప్రసాద్, ప్రొటెక్షన్ వాచర్లు చరణ్, దేవేంద్ర, నరేష్, వంశీ, హర్ష, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## గోడ మహిళా కూలి మృతి

**ప్రజాశక్తి- పూతలపట్టు:**

గోడ మహిళా కూలి మృతి చెందిన సంఘటన గురువారం పూతలపట్టు మండలం బంధార్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గణపతి నాయుడుకి సంబంధించిన ఇంటి పనులు చేస్తుండగా ప్రహరీ గోడ కూలి పడిపోవడంతో కూలి పనికి వచ్చిన వావిల్‌తోట పంచాయతీ మూర్తిగాని ఊరికి చెందిన మల్లిక (54) అక్కడకక్కడ మృతి చెందింది. సిఐ కృష్ణమోహన్ మృతి చెందిన మహిళను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డిగ్రీ అడ్మిషన్లు తక్షణమే చేపట్టాలి: ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

ఇంటర్ ఫలితాలు విడుదలై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్స్ చేపట్టలేదనీ, వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలను గురువారం భగత్ రవి సందర్శించారు. గత ప్రభుత్వం విద్యా సంస్కరణల పేరిట నాలుగేళ్ల డిగ్రీని ప్రవేశపెట్టిందన్నారు. మేజర్, మైనర్ సబ్జక్టులంటూ విద్యార్థులను గందరగోళానికి గురి చేసిందని మండిపడ్డారు. ఇంటర్నిష్ లంటూ పరిశ్రమల్లో, కంపెనీల్లో లేబర్లుగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వానికేమీ తీసిపోనట్లు విద్యా విప్లవం పేరిట అదే విధానాలను కొనసాగిస్తోందని విమర్శించారు. డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం కాకుంటే విద్యార్థులు చేరిక చాలా తగ్గి పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డబుల్ మేజర్ కోర్సులను కొనసాగించాలనీ, ఇంటర్నిష్ తీసివేయాలనీ, ఆఫ్ లైన్ లో అడ్మిషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థుల్లో దాగివున్న సజనాత్మకతను వెలికి తీసే వత్తి నైపుణ్యతా కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. డేవిడ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆగస్టు 4 నుంచి స్కిట్ లో అడ్మిషన్లు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆగస్టు 4వ తేదీ నుంచి ఇంజనీరింగ్ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమవుతాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్కిట్ కళాశాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. స్కిట్ కు సంబంధించిన రూ. 120 కోట్ల ఆర్థిక లావాదేవీల పైన ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ వచ్చిందని తెలిపారు. త్వరలోనే జీవో విడుదల కానుందని చెప్పారు.

## సెప్టెంబర్ 24 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు : ఈవో

**ప్రజాశక్తి - తిరుమల:** తిరుమలలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2 వరకూ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ప్రణాళికలు రూపొందించి నిర్దేశిత సమయంలోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి ఆదేశించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 23న అంకురార్పణ, 24న ధ్వజారోహణం, 28న గరుడ వాహనం, అక్టోబర్ 1న రథోత్సవం, 2న చక్రస్నానం ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వాహన సేవలు ఉంటాయి. బ్రహ్మోత్సవ రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే వృద్ధులు, దివ్యాంగుల, దాతల దర్శనాలూ రద్దు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, రోడ్‌మ్యాప్‌లు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 27–29 తేదీల్లో తిరుమల ఘాట్ రోడ్డుల్లో ద్విచక్రవాహనాలకు అనుమతి నిరాకరణ. భక్తుల రద్దీకి తగిన విధంగా లడ్డూలను నిల్వ ఉంచుకోవాలని ఆదేశించారు. డీఎఫ్ఓ ఫణి కుమార్ నాయుడు, ట్రాన్స్ పోర్ట్ జీఎం శేషారెడ్డి, సీపీఆర్వో డాక్టర్ టి.రవి, డిప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్, రాజేంద్ర, సోమన్నారాయణ, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, టీటీడీ ఆల్ ప్రాజెక్ట్స్ ఆఫీసర్ రాజగోపాల్, ఈఈలు సుబ్రహ్మణ్యం, వేణు గోపాల్, డిఈ చంద్ర శేఖర్, అశ్వినీ ఆసుపత్రి సివిల్ సర్జన్ కుసుమ కుమారి, ఎస్వీబీసీ ఓఎస్డీ పద్మావతి, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి జీ.ఎల్.ఎన్. శాస్త్రి పాల్గొన్నారు.